క్లుప్తంగా

శ్రీక్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు



శ్రీక్షేత్రం

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడలో వెలసిన శ్రీక్షేత్రంలో నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తేదీన ఆదిలక్ష్మి, నాలుగున ధాన్యలక్ష్మి, ఐదున ధైర్యలక్ష్మి, ఆరున సంతానలక్ష్మి, ఏడున గజలక్ష్మి, ఎనిమిదిన విజయలక్ష్మి, తొమ్మిదిన విద్యాలక్ష్మి, పదిన ధనలక్ష్మి, పదకొండో తేదీన ఐశ్వర్య లక్ష్మి అవతారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పట్టణ వీధుల్లో 'స్వచ్ఛతా హి సేవ'



ఎస్‌బీఐ సిబ్బంది ర్యాలీ

విజయనగరం అర్బన్: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పట్టణ శాఖల సిబ్బంది పట్టణ వీధుల్లో బుధవారం 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బాలాజీ జంక్షన్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అచంటా గార్డెన్, పెద్ద చెరువు ఫుట్‌పాత్ వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ సురేష్‌బాబు, హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్‌కృష్ణ, జోనల్ కార్యదర్శి రమేష్ కుమార్, దాదాపు 60 మంది ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రవికుమార్

భోగాపురం: భోగాపురం సర్కిల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా వి. రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పార్వతీపురం సర్కిల్ సీఐగా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తెచ్చిన నూతన ఎక్సైజ్ విధానం ప్రకారం భోగాపురం సర్కిల్ పరిధిలో ఉన్న పూసపాటిరేగ మండలంలో 9, భోగాపురం మండలంలో ఏడు ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయన్నారు.

భాష, కథలపై అవగాహన



బహుమతి పొందిన విద్యార్థినితో సంస్థ నిర్వాహకులు

విజయనగరం టౌన్: విద్యార్థులు భాష, కథలపై అవగాహన పెంపొందించుకోవాలని బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకెళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో బుధవారం నిర్వహించిన కథా పఠన పోటీల్లో పాల్గొన్న 28 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్‌కే బాబు, పప్పు భోగారావు, మానాప్రగడ సాహితీ వ్యవహరించారు. కథాపఠనంలో పాల్గొన్న వారందరికీ కథల పుస్తకాలు, పెన్నులు, అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సాహితీవేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాజ సేవకు ముందుకు రావాలి



గాంధీ సేవా పురస్కారాలను అందుకున్న సేవా ప్రతినిధులతో సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: దేశ వ్యాప్తంగా నేటితరం యువతకు తమ జీవితాలతో స్ఫూర్తినిచ్చిన మహాత్మా గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి ప్రేరణతో సమాజ సేవకు యువత ముందుకు రావాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పిలుపునిచ్చారు. మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాలలో సేవలందించిన ప్రతినిధులను గాంధీ సేవా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి మజ్జి కృష్ణారావు, మాతృభూమి సేవాసంఘ కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగరపు ఈశ్వర ప్రసాద్, డాక్టర్ చిన్నారావు, డాక్టర్ ఐ.నరేష్‌కుమార్, మరిశర్ల కృష్ణమూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాపూ .. నిను మరువలేం..



విజయనగరం అర్బన్: మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి



విజయనగరం: కార్పొరేషన్ కార్యాలయంలో గాంధీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్లు, అధికారులు



విజయనగరం ఫోర్ట్: సర్వజన ఆస్పత్రిలో గాంధీజీ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న డాక్టర్ సుదర్శి, తదితరులు

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకలించి భారతదేశానికి స్వేచ్ఛా వాయువులు తీసుకొచ్చిన మహానుభావుడు మహాత్మాగాంధీ. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో జాతిపిత గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



విజయనగరం: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు



విజయనగరం ఫోర్ట్: తోటపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గాంధీజీ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది



డెంకాడ: మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, తదితరులు



డెంకాడ: 5వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ అడిషినల్ కమాండెంట్ ప్రభాకరరావు, తదితరులు



పూసపాటిరేగ: గాంధీజీ విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు



విజయనగరం టౌన్: రోటరీ మ్యూజిక్ అకాడమీలో గాంధీ, శాస్త్రిల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



నెల్లిమర్ల: నగర పంచాయతీలో గాంధీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్

గాంధీ ఆశయాలు అనుసరణీయం..

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పారిశుధ్య కార్మికులకు సత్కారం



సన్మాన గ్రహీతలు పారిశుధ్య కార్మికులతో కలెక్టర్ అంబేడ్కర్, ఎమ్మెల్యే అదితి, తదితరులు

విజయనగరం: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు భావితరాలకు అనుసరణీయమని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్దనున్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పారిశుధ్య సేవకులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ, భారతదేశానికి స్వతంత్ర్యం తీసుకువచ్చిన మహానుభావుడు మహాత్మాగాంధీ అని తెలిపారు. అహింస అనే ఆయుధంతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వ్యక్తి బాపూజీ అని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడుచుకుని, తద్వారా భారతదేశం ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ.. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ఆనాడు మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రస్తుతం స్వర్ణ గ్రామసభలు నిర్వహించుకోవడం ఎంతైనా అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా గాంధీ మహాత్ముడు ఇచ్చిన స్వచ్ఛత నినాదాన్ని రుజువు చేసిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెద్ద చెరువు ప్రాంతంలో తుప్పలు, మొక్కలను ఏరివేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అవనాపు విజయ్, పి.ప్రసాద్, పాలవలస యశస్విని, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



ద్వారపూడిలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం రూరల్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. మండలంలోని ద్వారపూడిలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం ప్రతిఒక్కరు శతశాతం కృషి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ ఉమాశంకర్ మాట్లాడుతూ.. ద్వారపూడి గ్రామస్తుల నీటి అవసరాలను గుర్తించి ఇప్పటికే 539 ఇళ్లకు కుళాయిలు వేసినట్లు చెప్పారు. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్లను కూడా నిర్మించినట్లు తెలిపారు. జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో గడిచిన 15 రోజులుగా స్వచ్ఛాతా హి సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉప సర్పంచ్ వెన్ను శ్రీను మాట్లాడుతూ.. తమ గ్రామాన్ని ఆనుకుని ఉన్న పెద్దచెరువు వద్ద వాకింగ్‌ట్రాక్ ఏర్పాటుతో పాటు సుందరీకరణ చేయాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం పారిశుధ్య కార్మికులు ఆల్తి ఎర్రయ్య, బోని లక్ష్మణ, కోరాడ కృష్ణతో పాటు పలువురిని కలెక్టర్, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రకళ, తహసీల్దార్ కూర్మనాథం, పంచాయతీ విస్తరణాధికారి తిరుపతిరావు, సర్పంచ్ ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం

- ఎంపీడీఓ రాధిక



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఎంపీడీఓ రాధిక, తదితరులు

పూసపాటిరేగ : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. బుధవారం స్థానిక గుండం చెరువు గట్టుపై స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా చెరువు చుట్టు ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలు తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన భారతదేశాన్ని నిర్మించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటరావు, ప్రజాప్రతినిధులు ఎంవీజీ శంకరరావు, మహంతి శ్రీనివాసరావు, టి.సీతారాం, పిన్నింటి లక్ష్మినాయుడు, మహంతి శివ, పిన్నింటి సన్యాసినాయుడు, పీడీఏ ప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



చిన్నారుల నృత్య ప్రదర్శన

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి వైష్ణవీ కళాక్షేత్రం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పీఆర్‌వీఆర్ రంజని నిర్వహించిన భక్తిగీతాలాపన ఆకట్టుకుంది. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో అభినయప్రియ నర్తన నాటకశాలకు చెందిన ఎం.సాయిసుప్రియ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. శంబంగి భాస్కరరావు, ఎంవీ సుధాకరరావుల ఏకపాత్రాభినయనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఘనంగా సత్కరించారు.

సత్కారం..

డెంకాడ: మండలంలోని జొన్నాడ సచివాలయ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న కె.బంగార్రాజును బుధవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కోరాడ రమణి, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, సచివాలయ ఉద్యోగులు బంగార్రాజుకు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అభినందనలు



బాడీబిల్డర్స్‌తో శంకరరావు, తదితరులు

విజయనగరం: భగత్‌సింగ్ ఫెస్ట్ సందర్భంగా జరిగిన జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన బిల్డర్స్‌ను విజయనగరం జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శంకరరావు అభినందించారు. నగరంలోని ఫిట్‌నెస్ జిమ్‌లో బుధవారం నిర్వహించిన పోటీల్లో వివిధ కేటగిరీల్లో విజేతలుగా నిలిచిన ఎనిమిది మంది క్రీడాకారులకు పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ, జిమ్‌లో వ్యాయామం, బాడీ బిల్డింగ్‌లో శిక్షణ తీసుకోవడంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. అలాగే క్రీడాకారులు మహాత్మా గాంధీ స్ఫూర్తితో సమాజ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీనివాసరావు, విజేతలు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- గ్రామాల్లో ఏర్పాటైన మండపాలు
- ఒమ్మిలో పసుపుకొమ్ముల దుర్గమ్మ



పసుపు కొమ్ములతో అమ్మవారి ప్రతిమ

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలూ దసరా ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. సతివాడ, రామతీర్థం, నెలివాడ, గొర్లిపేట, బొప్పడాం, ఒమ్మి, తదితర గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లో మండపాలను అందంగా ముస్తాబు చేశారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు వినూత్న రీతిలో దుర్గమ్మ విగ్రహాన్ని సిద్ధం చేశారు. మొత్తం 150 కిలోల దేశీయ పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అమ్మవారి ప్రతిమను తయారు చేయించారు. ఒక్కో రోజు ఒక్కో సాంస్కృతిక కార్యక్రమం చొప్పున తొమ్మిది రోజుల పాటు తొమ్మిది కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ పంచామృతాభిషేకాలు, కుంకమార్చనలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

- సీఐ ప్రభాకర్



హెడ్ కానిస్టేబుల్ నాగరాజును సన్మానిస్తున్న సీఐ ప్రభాకర్, ఎస్సై సూర్యకుమారి, సిబ్బంది

భోగాపురం: అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడే గుర్తింపు లభిస్తుందని సీఐ ఎన్‌వీ ప్రభాకర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై పార్వతీపురం వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్ నాగరాజును సీఐ ప్రభాకర్, ఎస్సై సూర్యకుమారి బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... బదిలీ జరిగిన ప్రాంతంలో కూడా నాగరాజు మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్సై తవుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అవసరమైన చోట ఫ్లై ఓవర్లు నిర్మించండి..

- జాతీయ రహదారి పరిసర గ్రామాల ప్రజలు



ఫ్లైఓవర్ నిర్మించాల్సిన అవసరం ఉన్న పేరాపురం జంక్షన్

పూసపాటిరేగ: ఫ్లై ఓవర్లు అవసరమైన చోట నిర్మించాలని జాతీయరహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సాధారణంగా జాతీయ రహదారికి ఆనుకున్న ఉన్న జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లు నిర్మించాలి. అయితే అందుకు భిన్నంగా హైవే అధికారులు వ్యవహరిస్తున్నారు. మండలంలోని పేరాపురం వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాల్సి ఉన్నప్పటికీ హైవే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. అలాగే భోగాపురం మండలం సవరవల్లి జంక్షన్ చాలా గ్రామాలకు ప్రధాన కూడలి. గొలగాం, గంట్లాం, అక్కివరం, మోపాడతో పాటు ఇతర గ్రామాలకు చెందిన వాహనచోదకులు, ప్రజలు సవరవిల్లి జంక్షన్ మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పేరాపురం నిత్యం రద్దీగా ఉండే జంక్షన్ కావడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి ప్రధాన కూడలిలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఇక్కడ మంజూరు చేయలేదు. ఇక్కడి జాతీయ రహదారి దాటే సమయంలో వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పూసపాటిరేగ మండలం పేరాపురం జంక్షన్ మీదుగా వెంపడాం, గుంపాం, పతివాడ, చినపతివాడ, తాళ్లపేట, పతివాడబర్రిపేట, కొత్తూరు, తమ్మయ్యపాలెం, పులిగెడ్డతో పాటు పలు గ్రామాలు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పేరాపురం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పూసపాటిరేగకు వెళ్లి మళ్లీ వెనక్కి రావాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి ముఖ్యమైన జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లు నిర్మించాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

డైవర్షన్ ఇవ్వాలి..

పేరాపురం జంక్షన్‌లో డైవర్షన్ ఇవ్వకపోవడంతో 15 గ్రామాల ప్రజలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనాడ జంక్షన్‌కు వెళ్లి తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. హైవే అధికారులు ఈ జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మిస్తే వాహన చోదకులకు మేలు జరుగుతుంది.

-కె . జనార్దన్, పతివాడ

పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గ్రామ ప్రజలతో ప్రమాణం చేయిస్తున్న జిల్లా నెహ్రూ యువ కేంద్రం సభ్యులు

భోగాపురం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా నెహ్రూ యువ కేంద్రం సభ్యులు సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని ముక్కాం, కొండ్రాజుపాలెం గ్రామాల్లో జిల్లా నెహ్రూ యువ కేంద్రం సభ్యులు బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలతో కలిసి సముద్ర తీర ప్రాంతాల్లో ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో పాటు చెత్తాచెదారాలను ఏరి వేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గనగళ్ల బాలాజీ, ఎం. నరసింహులు, సూరాడ చిన్నారావు, దుక్క అప్పలరాజు, పంచాయతీ సెక్రటరీ సుజాత, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.